

కథా కౌముది

# మంచి-మిత్రుడు

వసుంధర



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
విశిష్ట బహుమతి పొందిన కథ

"నువ్వు మంచివాడివి. నీ మంచి నీకు చెడు చేస్తుంది. నేను చెడ్డవాణ్ణి. నా చెడు నాకు మంచి చేస్తుంది. అలాంటప్పుడు దేన్ని ఆచరించాలో నీకు ప్రత్యేకించి చెప్పాలా?" అన్నాడు రాజు.

రాజు మా ఊరి ప్రెసిడెంటు పాలేరు కొడుకు. నేనో మామూలు రైతుబిడ్డని. ఇద్దరిదీ ఒకే వయసు. ఒకే బడి. ఒకే క్లాసు.

మామిడిచెట్టు మామిడిపళ్లిస్తే, అదే నేలలోంచి మేడిచెట్టు- మేడిపళ్లనిస్తుంది. అలాగే నావీ, రాజువీ జ్ఞానపరిజ్ఞానాలు వేరు.

ఓసారి క్లాసులో, "వెలుగు మంచి. చీకటి చెడు. మనం వెలుగులో బ్రతకాలి. చీకట్లో నిద్రపోవాలి" అన్నారు తెలుగు మేస్టారు. చెడుని నిరసించి మంచిని పెంపొందించుకోవడానికి చిన్నప్పుడే- అలా ఆయన నాలో బీజం వేశారు.

"వంటికీ మెదడుకీ అలసట పోయి- కొత్త ఉత్సాహం రావడానికి నిద్ర అవసరం. మనం నిద్ర లేకుండా బ్రతకలేం. అంటే మనకు బ్రతుకునిచ్చేది చీకటి" అనేవాడు రాజు- ఆటల్లో మోసం చేసి గెల్చినప్పుడల్లా! అబద్ధాలు, మోసాలు, చిల్లర దొంగతనాలు, పరీక్షల్లో కాపీ- వాడికి మామూలు. నాకు తప్ప వాడి అసలు రంగు ఇంకెవరికీ తెలియదు. అదీ వాడి నేర్పు.

వాడంటే నాకిష్టం. వాడి గురించి ఎవరికీ చెప్పేవాణ్ణికాను. ఐతే చెడిపోతాడన్న భయముండేది. అందుకు నేనే బాధ్యుడినన్న అసంతృప్తి ఉండేది. “చెడుని నమ్ముకుంటే ఏదోరోజు దొరికిపోతావ్. అప్పుడు నీ గతేమిటి?” అనేవాణ్ణి అప్పుడప్పుడు.

అప్పుడు వాడు, “తప్పుని దాచడానికే చీకటి. అది మనిషికి నిద్రకు మించిన సుఖాన్నిస్తుంది. ఆ సుఖాన్ని అంతా చూసేలా అనుభవించడానికే వెలుగు” అని తెలుగు మేస్టార్ని తలదన్నే మాటొకటి అన్నాడు. పోనీ పురాణ కథలు చెబుదామంటే- అన్నీ వాడికీ తెలుసు. వాడి ప్రకారం అందులో మంచివాళ్లు పరీక్ష పేరిట జీవితమంతా కష్టపడతారు. చెడ్డవాళ్లు చనిపోయే ముందురోజు దాకా సుఖాలమీద సుఖాలే అనుభవిస్తూ వైభవంగా జీవిస్తారు.

“ఐనా వేలఏళ్ల క్రితం మాటలవి. ఇప్పుడు మనూళ్లోనే చూడు. పూజారి- ధర్మకర్త. పాలేరు- ప్రెసిడెంటు పాపారావు. మన నాన్నలు- షావుకారు. వీళ్లలో సుఖపడుతున్నది మంచివాళ్లా, చెడ్డవాళ్లా?” అన్నాడోసారి.

“మంచిచెడ్డలు నిర్ణయించడానికి మన అర్హతేమిటి? జ్ఞానులు చెప్పింది అనుసరించడమే మన కర్తవ్యం” అన్నాను.

“మహాభారతంలో కౌశికుడి కథ తెలుసుగా. ఆయన జ్ఞాని, తపస్వి. వంటింటికే పరిమితమైన ఓ ఇల్లాలు, ఊరిచివర్నుండే ఓ కసాయివాడు- ఆయనకి జ్ఞానబోధ చేశారు. కాబట్టి అర్హతల గురించి మర్చిపో. నాలో ధర్మవ్యాధుణ్ణి గుర్తించి నేను చెప్పేది విను. మంచీచెడుల వాస్తవాలపై వెలుగు పడకుండా చీకట్లోనే ఉంచేందుకు- తెలివిగా మనవాళ్లు రాసినవే పురాణాలు. ఆ ప్రభావమే నేటి పరిస్థితి. మంచిని నమ్ముకుంటే, ఎక్కడో చిన్న స్కూలుటీచరుగా తేలతావు. నా టార్గెట్ అదికాదు- మంచీచెడూ పట్టించుకోకుండా చుట్టూ ఉన్న మనుషుల్ని శాసించడం” అన్నాడు.

“ఎవరికేం రాసిపెట్టుంటే అదే జరుగుతుంది కానీ- మంచిగా జీవించడంలో గొప్ప సుఖం, సంతృప్తీ ఉన్నాయి. అవి లేనివాడికి ఎంతమందిని శాసించగల్గినా సుఖసంతోషాలుండవు” అన్నాను.

“అది తెలివితక్కువ మాట. ఐనా ఈ కంటికీ రెప్పలు దూరం కావు. నేను నమ్మింది నాకెప్పుడూ శాశ్వతమే. కానీ ఏదో రోజున- నువ్వు విసిగిపోతావు. మంచిని నిరసించి, నాతో చేతులు కలుపుతావు” అన్నాడు రాజు.

నాకది సవాలులా అనిపించింది. నెగ్గడానికి జీవితాన్ని పణంగా పెట్టాలనుకున్నాను.

పరీక్షల్లో కాపీ కొట్టినా టెన్తు ప్యాసవలేదు రాజు. తండ్రి వాణ్ణి పట్నంలో మేనమామ ఇంటికి పంపాడు. ఆ తర్వాతనుంచి కలుసుకుందుకు మాకొచ్చిన అవకాశాలు చాలా తక్కువ.

బీయస్సీ ఫైనలియర్లో ఉండగా– నాన్న ఆరోగ్యం పాడయింది. పైచదువుల ఆలోచన పక్కనెట్టి– బియ్యీడీ చేసి మా ఊరి కమిటీ హైస్కూల్లో టీచర్నై వ్యవసాయంలో ఆయనకు ఆసరాగా ఉన్నాను.

నేను ఉద్యోగంలో చేరిన మర్నాడు– రాజు మా ఊరొచ్చాడు. అప్పటికి వాడు కమిషన్ వ్యాపారం చేస్తూ బాగానే సంపాదిస్తున్నాడు. “నేనేదో మాటవరసకంటే, టీచరువై అన్నంతపనీ చేశావు. ఐనా మించిపోయింది లేదు. ఇప్పుడైనా నాతో వచ్చేసి, దందాలో సాయం చెయ్యి. నాకూ నమ్మకస్థుడైన మిత్రుడు కావాలి” అన్నాడు.

“భావిభారతపౌరుల్ని తీర్చిదిద్దే– గొప్ప ఉద్యోగమిది. నాకెంతో సంతృప్తిగా ఉంది” అన్నాను.

“ఈ తృప్తి నీకుండొచ్చు, నీ పెళ్లాం పిల్లలకుండొద్దూ. అప్పుడు నన్ను కలు” అని వెళ్లిపోయాడు రాజు.

అర్థమైంది. రాజుకి తన మార్గం తృప్తిగా లేదు. కనీసం నేను నా మార్గం మార్చుకుంటే అదో తృప్తి.

రాజు నాకోసం ఓ సంబంధం తెచ్చాడు. పెద్ద వ్యాపారస్థుడికి ఒక్కతే కూతురు. ఇల్లరికం వెళ్లి మామగారి వ్యాపార వ్యవహారాలు చూడాలి. కానీ వ్యాపారమంటే మోసం, దగా అని నా ఉద్దేశ్యం. ఇది రాజు నన్ను దారి మళ్లించడానికి చేసే ప్రయత్నమనుకుని, ఇల్లరికం రాలేనని మృదువుగా చెప్పాను. రాజుకి కోపమొచ్చింది. ఇలాగైతే నీకు పెళ్లే కాదని తిట్టి వెళ్లిపోయాడు.

నాకు పెళ్లయింది. కట్నం తీసుకోలేదు. నా భార్య రూప అనుకూలవతి అని సంతృప్తి. రాజు దృష్టిలో ఆమె గంతకుతగ్గ బొంత. అది నాకు తెలియాలని– ఓసారి కారేసుకుని మా ఇంటికొచ్చాడు. నన్నూ రూపనీ పట్నంలో వాళ్లింటికి తీసుకెళ్లాడు. ఇల్లంతా తిప్పి తన వైభవాన్ని చూపించి, “మీ ఆయన నాతో చేతులు కలిపితే, మనమిక్కడ కలిసుండొచ్చు” అని రూపకి పదేపదే చెప్పాడు.

ఊరెళ్లేక, “ఒకప్పుడు రాజు పరిస్థితి మనకంటే అధ్వాన్నం. స్వయంకృషితో ఇప్పుడింతవాడయ్యాడు” అన్నాను రూపతో. కావాలనే రాజు మార్గాన్ని ఆమెవద్ద నిరసించలేదు.

“స్వయంకృషిమీద అంత నమ్మకముంటే– మీ సాయమెందుకడుగుతాడు? తనకి మీ అవసరం బాగా ఉన్నట్లుంది” అంది రూప.

ఆమె నా ఔన్నత్యాన్ని గ్రహించిందో, అతడితో కలవమంటోందో అర్థం కాలేదు. కానీ అర్థం చేసుకునే ప్రయత్నమూ చెయ్యలేదు. ఎందుకంటే– రాజుకంటే ఉన్నతస్థానంలో ఉన్నానన్న భ్రమ నాకు లేదు. అతడితో కలవమని ఆమె చెప్పినా– నేనా మాట వినను. అందుకని రూప నాలో చూసిన ఔన్నత్యాన్ని– నేను రూపలో ఊహించుకుని మనసు సరిపెట్టుకున్నాను.

నాకో చెల్లి, ఇద్దరు తమ్ముళ్లు. చెల్లికి పెళ్లి చేశాం. తమ్ముళ్లని పట్నంలో చదివించాం. అందుకైన అప్పుల్ని కడుపు మాడ్చుకుని భరించాం. మధ్యమధ్య నాన్న అనారోగ్యం. 'పేదవాడి రోగం ఎదుగుదలకు చేటు' అనుకోవడం తప్పితే– ఆ అనారోగ్యం ప్రమాదకరమైంది మాత్రం కాదు.

తమ్ముళ్లకు చదువులై ఉద్యోగాలొచ్చాయి. పెళ్లిళ్లయ్యాయి. అప్పుల ప్రస్తావన తేకుండా, ఆస్తుల్లో వాటాకొచ్చారు.

వాటా ఇవ్వడానికి నాకూ, నాన్నకీ అభ్యంతరం లేదు. కానీ తమ వాటా పొలాన్ని అమ్మేసుకుని మా ఊరితో సంబంధం తెంచేసుకుందామని వాళ్ల ఆలోచన.

పొలం అమ్మడానికి నాన్న ఒప్పుకోలేదు. ఐతే ఆ వాటాని మమ్మల్నే తీసుకుని ఖరీదు కట్టి డబ్బిచ్చెయ్యమన్నారు వాళ్లు.

అంత డబ్బు మాకేదీ!

నాన్నకీ వాళ్లకీ పెద్ద గొడవైంది. సెంటు భూమి కూడా ఇవ్వనంటే– వాళ్లు కోర్టుకెడతామన్నారు.

ఎలా తెలిసిందో ఇది రాజుకి తెలిసింది. ఉరకలుపరుగులమీద నావద్దకొచ్చాడు. కోర్టులో మావాళ్ల కేసు నెగ్గకుండా మంచి లాయర్ని ఏర్పాటు చేస్తానన్నాడు.

ఆస్తికోసం అన్నదమ్ములు కోర్టుకెక్కితే నాన్న తట్టుకోలేడన్నాను.

"పోనీ, తమ్ముళ్లడిగే డబ్బు నేను సద్దేదా?" అన్నాడు.

దానికో షరతు. నేను తనతో చేతులు కలపాలి.

పొగ, మద్యంవంటి అలవాట్లనే కాదు, ఆ అలవాట్లున్నవాళ్లని కూడా దూరం పెట్టమని సలహా ఇస్తూ, "తాగుబోతులూ, పొగతాగు బోతులూ– తాము చిక్కుకున్న ఊబిలోకి మరింతమందిని లాగడానికి కొన్ని త్యాగాలకైనా సిద్ధపడతారు" అని స్కూల్లో సైన్సు టీచర్ హెచ్చరించడం గుర్తొచ్చింది. .

రాజుకంటే సమర్థుణ్ణని నేననుకోను. వాడికి నా ఎదుగుదలే ధ్యేయమనీ నమ్మను. ఉన్నంతలో తృప్తిగా జీవిస్తున్న నాలో అసంతృప్తిని ప్రవేశపెట్టేదాకా వాడికి తృప్తి ఉండదు. అందుకే ఈ ప్రయత్నాలు.

"నీతో చేతులు కలపలేను. ఇంకో మాట చెప్పు" అని ఖచ్చితంగా చెప్పేసి వాణ్ణి పంపేశాను.

ఉచితంగా ట్యూషన్లు చెబుతానని, ఊళ్లోవాళ్లకి నాపట్ల సుహృద్భావముంది. అంతా తలోచెయ్యీ వేసి డబ్బు సాయం చేస్తామన్నారు. అది తెలిసేక ఏమనుకున్నారో– తమ్ముళ్లు అప్పటికి తగ్గి, "ఏటా పొలంమీదొచ్చే అయివేజులో మా వాటా మాకిస్తూండండి. ప్రస్తుతానికి పొలం అమ్మొద్దులే" అన్నారు.

పొలంమీద ఆదాయం, నెలజీతం– వీటిలో ఏది వేణ్ణీళ్లో, ఏది చన్నీళ్లో చెప్పలేను కానీ– అప్పులు చేస్తూ, తీరుస్తూ ఏదో ముందుకెడుతున్నాం. మా పిల్లలిద్దరూ శ్రద్ధగా చదివి, మంచి మార్కులతో

స్కాలరుషిప్పులూ, లోన్లూ తెచ్చుకోవడంతో వాళ్ల చదువు మాకంత భారం అనిపించలేదు. రాజుకి నన్ను ప్రలోభపెట్టే అవకాశం రాలేదు.

ఇప్పుడు పెద్దవాడు సత్య ఇంజనీరు. చిన్న కంపెనీలో నెలకి ముప్పైవేలు జీతం. చిన్నవాడు ధర్మ ఇంజనీరింగ్ ఫైనలియర్. కాంపసు ఇంటర్వ్యూలో అన్నకు దీటైన ఆఫరొచ్చింది.

అప్పుడు సత్యకి ఓ విదేశీ కంపెనీలో నెలకి రెండున్నర లక్షల ఆఫరొచ్చింది. ఉద్యోగంలో చేరగానే సింగపూర్ వెళ్లే అవకాశముంది. ఎటొచ్చీ ముందుగా ఓ బ్రోకరుకి రెండు లక్షలు ఇవ్వాలి. అది లంచం కాదు, సర్వీస్ చార్జి అంటాడు సత్య.

తాకట్టులో ఉన్న ఇల్లు, పొలం– విడిపించడానికి ఐదు లక్షలు కావాలి. అమ్మేస్తామంటే– తాకట్టు విడిపించి మరీ కొనేవారున్నారు. కానీ అందువల్ల– ఎనభైఏళ్ల నాన్న సెంటిమెంటు దెబ్బతింటుంది; తమ్ముళ్లు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తారు; ఇక అవసరం నాది కాబట్టి ధర పలకదు. అంటే విధం చెడ్డా ఫలం దక్కదు.

సమస్యకు మరో పరిష్కారం– కోటికి పడగెత్తిన ఏడుకొండలు కూతురు శీలని సత్యకి చేసుకోవడం.

కానీ అప్పటికే సత్యకి మా బావమరిది కూతురు బిందుని అనుకున్నాం. సత్య– బిందు ప్రేమికులు కూడా. ఎటొచ్చీ వాళ్లూ మేమూ జోగీజోగీ లెక్క. కాబట్టి బిందుని కాదంటే శీల డబ్బుకి ఆశపడ్డట్లే. తలెక్కడ పెట్టుకోవాలి? ఆపైన శీల గురించి కొన్ని అనుమానాలున్నాయి. ఆమె కేరక్టర్లోనో, మానసిక స్థితిలోనో ఏదో తేడా ఉందంటున్నారు.

ఏ నిర్ణయం తీసుకున్నా అది సత్య భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందన్న సందిగ్ధంలో ఉండగా– అంతకంటే దారుణమైన సంఘటన జరిగింది. ధర్మకు యాక్సిడెంటు….

ఫ్రెండుతో బైక్ మీద వెడుతుండగా, ట్రక్కు గుద్ది పెద్ద యాక్సిడెంటయింది. ఫ్రెండు, ధర్మ– హాస్పిటల్లో ఐసియులో ఉన్నారు. ఇద్దరి పరిస్థితీ విషమంగా ఉంది. గ్యారంటీ లేదు కానీ, లేటెస్ట్ సర్జరీ టెక్నిక్ వాడితే బ్రతికే అవకాశముంది. అందుకు పది లక్షలౌతుంది.

ఇంటిల్లపాదీ కుప్పకూలిపోయాం. ఐతే ఏడ్వడానిక్కూడా సమయం లేదు. ఎలాగోలా ధర్మని బ్రతికించుకోవాలి. అర్జంటుగా ఏదో ఒకటి చేసి డబ్బు తేవాలి. కానీ ఏం చేద్దామన్నా కాళ్లూ చేతులూ ఆడ్డం లేదు.

అప్పటికి తమ్ముళ్లు స్పందించారు. గొంతులో దుఃఖం, మాటల్లో సానుభూతి అదేపనిగా పలికాయి కానీ డబ్బు దగ్గరకొచ్చేసరికి– ఐదో పదో– అదీ వేలలో తప్ప సాయం చెయ్యలేమని తేల్చారు.

అందుకు వాళ్లని తప్పు పట్టలేను. పది లక్షలతో ఓ ప్రాణం నిలబడొచ్చు, కానీ ఆ డబ్బు గోడక్కొట్టిన సున్నమేగా!

శీలతో పెళ్లికొప్పుకుంటే, సత్య జీవితం నాశనమౌతుంది. ధర్మ బ్రతికి బట్టకడతాడని గ్యారంటీ లేదు కానీ ముందు బిందు గుండె బద్దలవడం ఖాయం.

నాన్న పొలం అమ్మేద్దామన్నాడు. ఆయనకు మనవడికంటే సెంటిమెంటు ఎక్కువ కాదు. కానీ సెంటిమెంటు పోయినా ఆ మనవడు దక్కుతాడని లేదు. మనసు పరిపరివిధాల పోతుంటే– ఓ విధం రాజుని చూపించింది.

ఈ కంటికీ రెప్పలు దూరం కావనీ, ఏదోరోజు నేనూ తన మార్గాన్నే అనుసరిస్తాననీ సవాలు చేశాడు రాజు. సవాలుతోపాటే, "నాతో చేతులు కలుపుతానంటే, నా ఇంటితలుపులెప్పుడూ నీకోసం తెరిచే ఉంటాయి" అని హామీ కూడా ఇచ్చాడు.

రాజు పద్ధతుల్ని నిరసించాను. రాజునీ నిరసించాను. ఐనా తను కోపగించుకోలేదు. చిన్నబుచ్చుకోలేదు. నా వెంటబడి, బ్రతిమాలి సాయానికి ఆఫరిచ్చాడు. ఇప్పటికీ నన్ను గౌరవిస్తున్నాడు. కానీ సహనానికైనా హద్దుంటుంది కదా!

అది అవసరమో, అవకాశవాదమో చెప్పలేను. నాకు రాజు చెడ్డతనంలో సమర్థత కనిపిస్తోంది. సాయం చేస్తానంటూ నా వెంటబడ్డ వాడిలో– తాగుబోతో పొగతాగుబోతో కాక– మంచితనం దర్శనమిస్తోంది. అదే రూపకి చెప్పాను.

ఆమె నా నిర్ణయంలో తప్పొప్పుల్ని విశ్లేషించలేదు. "ఇంత జరిగేక మనకింకా సాయం చేస్తాడా?" అన్న అనుమానం వ్యక్తం చేసింది.

అనుమానం నాకూ ఉంది. కానీ ఆశ దాన్ని మింగేస్తోంది.

రాజుని సాయమడగడానికి ఏం సంజాయిషీ ఇవ్వాలి? సంజాయిషీ ఇవ్వడానికి సిగ్గు, అభిమానం అడ్డు రావా?

అవసరం, అవకాశవాదం– ఇవే మనిషికి స్వతస్సిద్ధంగా– నీతినియమాల్నీ, ధర్మాధర్మాల్నీ ఉపదేశిస్తాయి. నా విషయంలోనూ ఇప్పుడదే జరుగుతోంది. రామదాసు అంతటి మహాభక్తుడు దెబ్బలకి ఓర్వలేక, 'ఎవడబ్బ సొమ్మని కులుకుచు తిరిగెదవు' అని ఇష్టదైవం శ్రీరామచంద్రుణ్ణి నిందించాడు. ఆ వెంటనే, "అబ్బా తిట్టితినని ఆయాసపడవద్దు, ఈ దెబ్బలకోర్వక అబ్బ తిట్టితినయ్యా" అని సంజాయిషీ ఇచ్చుకున్నాడు. ఇక నేనెంత?

తక్షణం రాజుని కలవాలనుకున్నాను.

వాడిలో సహనం ఇంకా మిగిలుండాలని దేవుణ్ణి కోరానో లేదో, రాజునుంచి ఫోనొచ్చింది.

మొబైల్లో వాడి పేరు చూడగానే- తపస్సు చెయ్యకుండానే దేవుడు ప్రత్యక్షమైన భావన కలిగింది. “అన్యథా శరణం నాస్తి. త్వమేవ శరణం మమ” అనాలనుకున్నాను. కానీ మాట రాలేదు.

అట్నించి వాడే, “సారీరా! నువ్విప్పుడు ఒప్పుకున్నా, నీతో చేతులు కలపడానికి నేను సిద్ధంగా లేను. సవాల్లో నేనోడిపోయాను. నువ్వే నెగ్గావు. కంగ్రాట్యులేషన్స్” అని ఫోన్ పెట్టేశాడు.

అది వెటకారమా, ప్రతీకారమా? రెండింట్లో ఏదైనా దానికిప్పుడు సమయం కాదు.

రాజు చెడ్డవాడని చిన్నప్పట్నించీ తెలుసు. మొదటిసారిగా వాడి చెడ్డతనం ఎంత దారుణమైనదో స్వానుభవమయింది.

ఐపోయింది. రాజుకి సహనం ఐపోయింది. నా కొడుకు ధర్మ పని ఐపోయింది.

ఫోన్ స్విచాఫ్ చేసి ఉన్నపళంగా కూలబడ్డాను. చుట్టుపక్కల ఏం జరుగుతున్నదీ నాకు తెలియదు- స్పృహ తప్పిందేమో మరి---.

“ఏమండీ, ధర్మ ఔటాఫ్ డేంజరుట. ఇప్పుడే ఫోనొచ్చింది” అంటూ రూప నన్ను కుదుపుతుంటే స్పృహలోకొచ్చాను. పరిస్థితి ఆకళింపు కావడానికి కాసేపు పట్టింది.

ధర్మ యాక్సిడెంటు విషయం మాకంటే ముందే రాజుకి తెలిసిందిట. వెంటనే రంగంలోకి దిగి ఏదో ట్రస్టు ద్వారా సర్జరీకి అన్ని ఏర్పాట్లూ చేశాడు. ధర్మకే కాదు- వాడి ఫ్రెండుకి కూడా!

సమస్య ధర్మదే కాదు. సత్యదీ పరిష్కారమైంది. ఏ బ్రోకరు అవసరం లేకుండానే, వాడి ఫారిన్ కంపెనీ ఆఫర్ సెటిలయింది.

“చేతులు కలుపుతానని నన్ను దేబిరించే అవసరం నీకిక జన్మలో రాదు. కంగ్రాట్స్” అన్నాడు రాజు నన్ను కలిసినప్పుడు.

వాడి మొహంలో సంతోషం చూసి, “సవాల్లో ఓడిపోయినందుకు బాధగా లేదా?” అన్నాను ఆశ్చర్యంగా.

అప్పుడు వాడిచ్చిన సమాధానంలో నేనూహించని వేదాంతముంది.

ప్రపంచంలో మంచీచెడూ కలిసుంటాయి. మంచిని నమ్మితే సుఖాలు తక్కువైనా, జీవితంలో రిస్కులూ తక్కువే. అందుకని ఎక్కువమంది మంచిని ఆశ్రయించి కష్టాలకు సద్దుకుపోతుంటారు.

చెడుని నమ్మితే సుఖాలు బాగా ఎక్కువైనా, జీవితంలో రిస్కులూ ఎక్కువే. అందుకని చెడుని నమ్మేవాళ్ల సంఖ్య తక్కువ.

ఐతే ప్రపంచం మనుగడకి మంచితనం ముఖ్యమని చెడ్డవాళ్లకి కూడా తెలుసు. మంచివాళ్లు నిస్పృహకి లోనై చెడువైపు మొగ్గే పరిస్థితి వస్తే, చెడ్డవాళ్లు ఏ షరతులూ లేకుండా స్వచ్ఛందంగా మంచివాళ్లకి సాయం చెయ్యడమందుకే.

చెడ్డవాళ్ల సంఖ్యని తక్కువగా ఉంచుతూ, మంచివాళ్ల సంఖ్య తగ్గకుండా కాపాడుకోవడంలోనే- చెడ్డవాళ్ల సుఖాలకి గ్యారంటీ ఉంది.

"పురాణాల్లో మంచివాళ్లు జీవితమంతా పరీక్షలకి గురై చివర్లో సుఖపడితే- చెడ్డవాళ్లకు వరాలు లభించి జీవితమంతా సుఖపడి, చివర్లో శిక్ష అనుభవించడంలోని మర్మమిదే! అది గ్రహించాకనే నా ఛాయిస్ నేను తీసుకున్నాను. సవాల్లో నీ గెలుపు నిజానికి నా గెలుపు" అని నవ్వాడు రాజు.

ఈ లాజిక్ విన్నాక- ఆశ్చర్యపడ్డమే కాదు, అయోమయంలోనూ పడ్డాను.

"అంతా బాగానే ఉంది కానీ, నాతో చేతులు కలపనని చెప్పావే, అప్పటి నా మనఃస్థితి నీకు తెలియదా? కంగ్రాట్స్ చెప్పడంలో నీ ఉద్దేశ్యమేమిటి?" అన్నాను వాడి శాడిజంలో మరో కోణాన్ని వెలికిచూపే ప్రయత్నంలో.

"నాతో చేతులు కలపకపోవడం నీ జీవితాశయం. అది దెబ్బతినే పరిస్థితి వచ్చింది. నువ్వు మంచివాడివి. నేను మంచివాణ్ణి కాకపోవచ్చు కానీ నీకు మిత్రుణ్ణి. నీ ఆశయం దెబ్బ తినబోదని తెలిస్తే, సంతోషిస్తావన్న స్నేహభావంతో కంగ్రాట్స్ చెప్పాను. ఏం, తప్పా?" అన్నాడు రాజు.

తెల్లబోయాను.

రాజు కంగ్రాట్స్ చెప్పినప్పుడు సంతోషించానా? సంతోషించకపోతే ఏంచేశాను?

రాజుది వెటకారమో, శాడిజమో, స్నేహమో తెలియదు. రాజు నాపట్ల ధర్మవ్యాధుడౌనో కాదో తెలియదు.

కానీ- నేనప్పుడు నా మంచితనం గురించి కౌశికుడిలాగే సందిగ్ధంలో పడ్డాను---.

---0---

COMMENTS